# పుట్టగొడుగు

ఆనాడు పౌర్ణమి. జాగీర్దారు పరమేశ్వరయ్య మేడమీద పడుకొన్నాడు. అంతకంటే ఎత్తయిన భవనం ఆ గ్రామంలో లేదు. ఉండడానికి వీలుకూడా లేదు. అన్నీ పూరి గుడిసెలే. ఒక్క పెంకుటిల్లున్నా అదేమంత పెద్దదీ కాదు. పరమేశ్వరయ్య కింకా నిద్రపట్టలేదు. అది నిద్రపట్టే తరుణం కాదు. వెన్నెల చల్లగా కురుస్తున్నది. గాలి గిలిగింతలు పెడుతున్నది. రాణిగారు ఊళ్ళోలేరు. ఆమె పురుడు పోసుకోవడానికి తల్లిగారింటికి వెళ్ళింది. అప్పటికే మూడు మాసాలు గడిచాయి. ఎడబాటు ఒక్కొక్కసారి దంపతుల మధ్య అనురాగాన్ని పెంచుతుంది. హృదయాలు ఏ కొంచెమైనా బలహీనంగా ఉంటే గరళాన్ని చిలుకుతుంది. అది మానవతను వికసింప జేస్తుందొకసారి. కొంచెం ఆవేశం ఆతురతా ఉన్న వారిని సంకుచిత వలయంలో బంధిస్తుంది. జీవితాంతమూ పశ్చాత్తాపానలంలో ఉడికిస్తుంది.

పరమేశ్వరయ్య తన ఎస్టేటు వ్యవహారాలలో కఠినంగానే ఉంటాడు. అయినా అతని వ్యక్తిత్వంలో ఒక ప్రత్యేకతను పెంచుకున్నాడు. అందుకు కారణం ఒక్కటుంది. పరమేశ్వరయ్య అన్నగారు పార్వతీశం మూడేళ్ళ క్రితం తీవ్రమైన జబ్బుతో చనిపోయాడు. అతడు భోగలాలసుడు. అక్కడేదో చదివి వరగబెడతాడని ఆశించారు కానీ అనుదినమూ త్రాగుడూ వ్యభిచారం జూదం వాటిలో ఆరి తేరాడు. చివరికీ కుళ్ళిపోయిన శరీరంతో ఇల్లు చేరాడు. ఎందరో డాక్టర్లు చూచి సాధ్యమైనంత, అవకాశమున్నంత డబ్బు కాజేశారు గానీ ఒక్కరూ బాగు చేయలేక పోవడంతో కళ్ళు మూశాడు. అప్పటి నుండి పరమేశ్వరయ్యకు భయం. అందుకు తగ్గట్టు తండ్రి కూడా పెళ్ళి చేశాడు. పసితనంలో పెళ్ళి చేస్తే మళ్ళీ తప్పుడాటలాడే అవకాశం ఉండదు. ఉన్నా బహు తక్కువ.

పరమేశ్వరయ్య కీ విషయాలన్నీ గూడా ఒక్కసారి జ్ఞాపకానికి వచ్చాయి. అయినా అతనిలో ఏదో అదృశ్య శక్తి ప్రవేశించింది. వాతావరణం కూడా అలాంటిదే. నిండు పున్నమి చిత్రకారునిలో శిల్పాన్ని పుట్టిస్తుంది. కవిలో

భావాలను పరుగెత్తిస్తుంది. ఒంటరితనంలో నున్న యౌవనవంతునిలో తియ్యని ఊహలను రేకెత్తిస్తుంది.

పరమేశ్వరయ్య మంచం మీద నుండి లేచాడు. లోపల నుండి గంటలు కొడుతున్నాయి. అతడు ఎంచుకోలేక పోయాడు గాని పన్నెండు ఉండవచ్చు. పడమటి కొనవరకూ వచ్చి క్రిందకు చూశాడు. గుడిసె ముందు పడుకొని నిద్రపోతున్నది బుచ్చి. ఆమెకు కుడివైపు నాలుగు గజాల దూరంలో ముసలమ్మ గుర్రు పెడుతోంది. బుచ్చి ఒంటినిండా బట్ట కప్పుకొన్నది. ఆమె ముఖం మాత్రం స్పష్టంగా వెన్నెల్లో ప్రకాశిస్తోంది.

పరమేశ్వరయ్యకు బుచ్చిని బాగా తెలుసు. ఆ పిల్ల పని చేరి నాలుగేళ్ళయినై. తన భార్య కౌసల్యకు ఆమె అంటే ఇష్టం కూడా. తన పాతచీరెలన్నీ ఆమెకే ఇస్తూంటుంది. ఎంతో ఆదరంగా చూచుకొంటోంది.

అతడు వెనక్కి తిరిగి చూశాడు. ఎవ్వరూ లేదు. కుక్క మాత్రం జోగుతూ పడి ఉన్నది. అది సాయంకాలమే శేరు మాంసం తిన్నది. అడవిలో ఎవరు వేటాడినా ఒక కుడికాలు మాంసంతో తెచ్చి జాగీర్దారు వంటగదిలో ఇచ్చి వెడతారు. అది తరతరాల పద్ధతి. ఆ రోజు సాయంకాలం ఎవరో దుప్పిని కొట్టి కుడికాలు తెచ్చి పడవేశారు. కొంచెం ఆలస్యమవుతుంది వండడానికని కుక్కకే వేశారు.

పరమేశ్వరయ్య మెల్లగా మేడమెట్లు దిగాడు. తనకు తెలుసు. అది తప్పని కూడా తెలుసు. అలాంటి తానెందుకు దిగుతున్నాడో ఎక్కడికి వెడుతున్నాడో! తప్పును తానది వరకూ చేయలేదని కూడా తెలుసు. కానీ అతని పాదాలు మాత్రం ముందుకే అడుగులు వేస్తున్నాయి. మెట్లు దిగి మామిడిచెట్టు క్రింద నిలబడ్డాడు. అక్కడికీ బుచ్చి ఉన్నచోటుకూ అయిదారు గజాలున్నాయి. ముసలమ్మ మినహా మరెవ్వరూ లేదు.

తానిపుడేం చెయ్యాలి? తనకు తానే ప్రశ్నించుకున్నాడు. భయపడరాదను కున్నాడు. అసలు భయపడవలసిన అవసరం కూడా లేదు. తాను జాగీర్దారు. ఈ ప్రాంతంలో తనకు మించిన వారు లేరు. ఒక సమయం ఎదిరించినా ఆ పిల్ల ఏం చేయగల్గుతుంది.

పరమేశ్వరయ్య గుండెలు నిశ్చలంగా నిలిచాయి. ముందుకు వెళ్ళాడు. ఆమెను లేపాడు. బుచ్చి కళ్ళు తెరచి చూసింది.

"బాబుగారా!" అంటూ చివాలున పైకి లేచింది.

"రా చెబుతాను" అంటూ ఆయన ముందుకు సాగబారాడు. బుచ్చి అనుమానిస్తూనే అనుకరించింది. నాలుగు నిమిషాలకల్లా మేడమీదకు వెళ్ళారు.

"ఏం పని బాబుగారు?" ప్రశ్నించింది బుచ్చి.

"చెబుతాను"... అంటూ పరమేశ్వరయ్య దగ్గరకు వచ్చాడు. ఆమె కొంత వెనక్కు జరిగింది. అతడు క్షణం ఆగి చేతిని పట్టుకున్నాడు. బుచ్చి కంపించి పోయింది. చేతిని విడిపించుకొని వెనుదిరుగ బోయింది. కానీ పరమేశ్వరయ్య ఆమెను నిర్బంధంగా తీసుకెళ్ళి మంచంమీద కూచోబెట్టాడు. ఆమె తలవంచు కొన్నది. జాబిల్లి దూదికొండల్లాంటి మేఘాల వెనకకు వెళ్ళిపోయాడు.

* * *

కాలగర్భంలో ఇరవై రెండు సంవత్సరాలు దొరలి పోయినై.

ఆ రోజు అమావాస్య. అయినా చుక్కలు బాగా వెలుగుతున్నాయి. పాలపుంత వెన్నెలలను చిలుకుతోంది. కోడిపిల్లలు దివిటీలను పడుతోన్నై. ధ్రువుడు నిశ్చలంగా వెలుగుతున్నాడు.

పరమేశ్వరయ్య మేడమీద కూచున్నాడు. అతని మీసాలు వెండి తీగెల్లా మెరిసి పోతున్నాయి. కమ్మని చుట్టను పీలుస్తూ ఎదురుగా కూచున్న కౌసల్యతో అన్నాడు.

"వాడి కెప్పుడూ కుక్కల మీదనే ధ్యాసైపోయింది. ఆరు వందలు తగల బెట్టి ఆ కుక్కను కొనకుంటేనేం?"

"ఏదో సరదాకని కొన్నాడు. వాణ్ణి ఏమీ అనకండి" అన్నది కౌసల్య. ఈలోగా సాంబశివం పైకి వచ్చాడు. వెండి గొలుసుతో కుక్క కూడా వచ్చింది. అది చాలా ఎత్తుగా ఉంది. చారలుంటే పులి అనుకోవచ్చు. కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయి. మూరెడు నాలుకను బయటకు చాచి సాంబశివం బూట్లను శుభ్రంగా నాకివేస్తున్నది.

"వాడు మొదట ఎనిమిది వందల కొక్క దమ్మిడీ తగ్గనన్నాడు. రెండు వందలు తగ్గడానికి దేవతలు దిగి వచ్చారు" అన్నాడు సాంబయ్య.

పరమేశ్వరయ్య ఏమీ మాట్లాడకుండా పైకి లేచి పచారు చేయసాగాడు.

"బాగానే ఉంది" అంటూ కౌసల్య కుక్కను దువ్వుతోంది.

పరమేశ్వరయ్య పడమటి కొనకు వెళ్ళి క్రిందికి చూచాడు. బుచ్చి గుడ్డి లాంతరు ముందు కూర్చొని తన కొడుకు మల్లుగానికి సంగటి పెడుతున్నది. ఆ మసక మసక వెలుగులో ఆమె ముడతలు పడిన ముఖం అస్పష్టంగా కన్పించింది. పరమేశ్వరయ్య రెండు నిమిషాలు విగ్రహంలాగ చలనం లేకుండా నిలిచి పోయాడు.

"ఒరేయ్ మల్లూ" సాంబశివం పిలిచాడు గట్టిగా. ఈ కేకకు ఉలిక్కి పడ్డ మల్లు సంగటి ముద్దనలాగే వదలి చెయ్యి కడుక్కున్న సాంగ్యం చేసి గబగబా మెట్లెక్కి వచ్చాడు.

పరమేశ్వరయ్య ఆ వైపున సోఫాలో కూర్చొని దీర్ఘంగా నిట్టూర్చి పొగచుట్టను వెలిగించాడు. సాంబశివం పడక కుర్చీలో కాళ్ళు చాచుకొని కూర్చున్నాడు. మల్లుగాడు సాంబశివం బూట్లను విప్పుతున్నాడు. కౌసల్య ఏదో జ్ఞాపకం వచ్చి క్రిందికి దిగి వెళ్ళింది.

పరమేశ్వరయ్య ఒక్కసారి పైకి చూశాడు. ఆకాశంలో చుక్కలు మాలిన్య రహితంగా ప్రకాశిస్తున్నాయి. అతడు మళ్ళీ తలను ప్రక్కకు తిప్పి గుక్కనిండుకూ పొగను పీల్చి పుస్తకాన్ని తెఱచి ఎదురుగా నున్న దృశ్యాన్ని చూశాడు.

సాంబశివం.

మల్లుగాడు.

సాంబశివం కౌసల్య కొడుకు.

మల్లుగాడు బుచ్చికొడుకు.

సాంబశివం మల్లుగాళ్ళిద్దరూ తన కొడుకులే. వారిద్దరిలోనూ సాంబశివమే తన కొడుకని లోకం అనుకుంటున్నది. సంఘం అనుకొంటున్నది. కుటుంబమూ అనుకుంటున్నది.

మల్లుగాడు తన కొడుకని తనకు మాత్రమే తెలుసు. బహుశా చంద్రునికి ప్రాణం ఉంటే అతనికి తెలుసు. ఆనాడు చూశాడు సాక్షిగా. మేఘుడు కూడా చూశాడు. ప్రకృతి చూచింది. వాయుదేవుడు చూశాడు. పంచభూతాలు చూశాయి. వీటి సాక్షిగానే పరిణయాలు జరుగుతాయి. చూడని దెవరు? మానవులు మాత్రమే. అంతలో మాత్రానికి అతడు తన కొడుకు కాకపోతాడా?

"ఒరేయ్... వీటిని శుభ్రంగా తుడిచి కొంచెం పాలిష్ వేసి జాగర్త పెట్టు.

ముందు అక్కడున్న చెక్క జోళ్ళు తీసుకురా" అన్నాడు సాంబశివం.

మల్లుగాడు బూట్లు తీసుకొని మేడ దిగి వెళ్ళిపోయాడు. పరమేశ్వరయ్య హృదయ కవాటం తెరచుకున్నది. మానవత తన శక్తిని విద్యుత్తులా ప్రవహింప చేసింది. ఆయన మనో నేత్రాలు తెరచాడు. బాహ్య నేత్రాలు నీటి బుగ్గలను చిమ్మాయి. అంతరంగంలో సున్నితమైన ధ్వని వినిపించింది.

"ఎంత తప్పు? ఎంత అమానుషం. ఒకే తండ్రికి పుట్టిన ఇద్దరు బిడ్డలు. ఒకడు యజమానుడు ఒకడు నౌకరు."

ఆయన శరీరం నిస్సత్తువగా కన్పించింది. గుండెలు మాత్రం చాలా బరువుగా ఉన్నట్లు తోచి కొంచెం వెనక్కు ఒరిగి కాళ్ళను మరికొంచెం ముందుకు చాచాడు.

"ఒరేయ్ మల్లూ! తూగుపోతు కొడుకా! ఎంతసేపురా!" గర్జించాడు సాంబశివం.

పరమేశ్వరయ్య చెవులు మూసుకున్నాడు. క్షణమాగి "ఎందుకురా అలా తిడుతావ్, బూట్లు తుడవడం చెప్పులు మోయించడం మహాపాపం తెలుసా" అన్నాడు పరమేశ్వరయ్య. అతడంతకంటే మందలించలేడు. మందలించే వీలు లేదు. రెండు దశాబ్దాల ముందు జరిగిన సంఘటన ఇన్నాళ్ళూ బయట పడని రహస్యం. ఈనాడు బయటపడితే ఏముంది? పరువు పాడయిపోతుంది. మానం మంట గలసి పోతుంది. గౌరవం బూడిదై పోతుంది.

సాంబశివం పైకి లేచి కుక్కను వెండి గొలుసుతో ఒక్క దెబ్బ కొట్టాడు. అది కంయ్ మన్నది. ఆ కోపం తన మీదనేనని పరమేశ్వరయ్యకు తెలుసు. ఐనా అతడు మౌనం వహించాడు. మల్లుగాడు కర్ర జోళ్ళు తెచ్చి సాంబశివం పాదాల ముందు పెట్టాడు. అతడు తొడుక్కొని మేడదిగి వెళ్ళాడు. పరమేశ్వరయ్య యింకా కుర్చీలోనే కూచుని ఉన్నాడు. ఇంతలో కౌసల్య పైకి వచ్చి "సాంబశివానికి నీళ్ళు తోడు" అన్నది మల్లు గబగబా దిగినాడు మేడ.

"ఏమిటి ఆలోచిస్తున్నారు" కౌసల్య పలకరించింది.

పరమేశ్వరయ్య ఉలిక్కిపడి "ఆ ఏమీ లేదు" అంటూ పైకి లేవబోయాడు.

"కూచోండి ఇంకా వంట కాలేదు. అరగంటముందే ఎవరో కుందేలును తెచ్చి యిచ్చారట. వంట వాడు పావుగంట ఆగమన్నాడు" అన్నది.

పరమేశ్వరయ్య మళ్ళీ అలాగే కూర్చొని ఆరిపోయిన చుట్టను వెలిగించాడు. రెండు గుక్కలు బలంగా పీల్చి గట్టిగా దగ్గాడు.

"బాగుంది. భోజనం అయ్యాక ఒక్కటి త్రాగితే చాలుగా ఎప్పుడూ పీల్చటమే పని" అన్నది కౌసల్య.

"ఎందుకో ఆయాసంగా ఉంది. ఏమీ తోచకుంటే ముట్టించాను" అన్నాడు పరమేశ్వరయ్య. కౌసల్య ఆ మాట ఈ మాట మాట్లాడుతూ సాంబశివం పెళ్ళి ప్రస్తావన కూడా తెచ్చింది. అతనికి ఇరవై యేళ్ళు దాటాయి కూడా. యింకా పెళ్ళి చేయకుంటే బావుండదనీ- యుక్త వయస్సులో చెడిపోయే అవకాశాలు బోలెడుంటాయనీ చెబుతున్నదామె. పరమేశ్వరయ్య ఊకొడుతూ మధ్యమధ్య ఏదో చెబుతున్నాడు. కానీ తానేం చెబుతున్నాడో తనకే తెలియదు.

ఇంతలో వంటవాడు పిలిచాడు. అందరూ కూచున్నారు. పరమేశ్వరయ్య పళ్ళెం ముందు కూచున్నప్పుడు తానంతకు ముందే చూచిన దృశ్యం జ్ఞాపకానికి వచ్చింది. తన ఎదుట కూర్చున్న సాంబశివం రాజినాలు తింటున్నాడు. గుడిసె ముందు చూచిన మల్లుగాడు సజ్జ సంగటి తింటున్నాడు. ఇద్దరూ కొడుకులే. కౌసల్య మేడలో ఉంది. బుచ్చి మేడ నీడలోని గుడిసెలో ఉంది. ఇద్దరూ భార్యలే. వీరికి భేద మేమిటి? ఒకరు కట్టుకొన్నవారు. మరొకరు పెట్టుకొన్న వారు. లోకంలో కొన్ని సందర్భాలలోనే గాదు అనేక సందర్భాలలో కట్టుకొన్న భార్యల కంటే పెట్టుకొన్న ప్రియురాళ్ళే ఎక్కువ భోగాలనుభవిస్తారు. అయితే వారిలో చాకచక్యముంటుంది. నేర్పు వుంటుంది. జాణతనముంటుంది. వారే వలచి వలపింప జేసుకొంటారు. బుచ్చి విషయమదిగాదు. ఆమె వలపింప బడింది. నిర్బంధించబడింది. వంచించ బడింది.

అతడాలోచిస్తూ ఏం తినగలడు? ఎంత తినగలడు. వేడివేడి గరమసాలతో ఘుమ్మనే సువాసనలతో పరిమళించే వెన్నలాంటి మృదువైన కుందేలు కూర అతనికి రుచించలేదు. కమ్మని కాశీపిచనాల వరి అన్నం అతనికి మనస్కరించ లేదు. "నాకు ఆకలి వేయడం లేదు" అంటూ పైకి లేచాడు. కౌసల్య విస్తు పోయింది. సాంబశివం మాత్రం ఒక్కసారి తండ్రి వంక చూచి మళ్ళీ తన పనిలో లీనమయ్యాడు.

రాత్రి జాము గడిచాక పరమేశ్వరయ్య మేడ మీదకు వచ్చాడు. మల్లుగాడు అక్కడే ఉన్నాడు. బోరగిలా పడుకొని ఉన్న సాంబశివానికి ఒళ్లు పడుతున్నాడు. పాదాలు నలుపుతున్నాడు. నాన్నగారు అక్కడికి రావడం గమనించి "ఇక వెళ్ళరా" అన్నాడు సాంబశివం. మల్లుగాడు మేడ దిగి గుడిసె వైపు వెళ్ళాడు.

పరమేశ్వరయ్య పడమటి కొనకు వెళ్ళి నిల్చుని చుట్టను వెలిగించాడు. అప్పుడే గంటలు కొట్టింది గడియారం. పదకొండు. బుచ్చిగుడ్డి లాంతరు తెచ్చి గుడిసె ముందు పెట్టింది. మల్లుగాడు కూర్చున్నాడు. మూడుగంటల క్రితం మూకుడులో వదలి పెట్టి వెళ్ళిన సంగటి ముద్ద అలాగే ఉంది. మూడు నాలుగు నిమిషాల్లోనే ఆ అరముద్దనూ మ్రింగి ముంతెడు నీళ్ళు త్రాగాడు మల్లుగాడు. బుచ్చి బొంతను తెచ్చి వేసింది. గుడిసె ముందే దానిని పరుచుకొని రెండు ఇటుకలను తలగడగా ఉంచుకొని మల్లుగాడు పడుకొన్నాడు.

పరమేశ్వరయ్య క్రింద నుండి చూపులను పైకి ప్రసరించాడు. మేడమీద హంసతూలికా తల్పంలో హాయిగా దోమ తెరలో శయనించాడు సాంబశివం. మళ్ళీ క్రిందకి చూచాడు. కటిక నేలమీద చినిగిన బొంతపై ఇటుకల తలగడతో నిద్రించాడు మల్లుగాడు. అతని గుండెలను ఏదో ఒక అపూర్వ శక్తి పెద్ద కత్తెరను పట్టుకొని సన్నసన్నగా కత్తిరిస్తున్నట్లు తోచింది. మనస్సు తుపానులో చెదిరిన మేఘశకలాలైంది. అతి భారంగా అడుగులు వేస్తూ మేడ మెట్లు దిగి వసారాలో వేసిన పట్టు పరుపుపై పడుకున్నాడు. అది ముళ్ళ తొడుగులాగా తోచింది. ఒక్కసారి ఆ గుడిసెలో బుచ్చమ్మ ఒడిలో నిద్రపోతే!.... ఈ ఆలోచన రాగానే అతని శరీరం కంపించింది. కన్పించని భయంతో గుండెలు బిగుసుకొని పోయాయి. తలగడను పైకెత్తి నొసటిపై అదుముకొని కళ్ళు మూసుకొన్నాడు. చీకటి తెరలలో వింతవింత రంగులు కన్పిస్తుంటే ఏదో స్వప్న సీమలకు తనకు తెలియకనే వెళ్ళిపోయాడు.

* * *

ఒక్క ఆయనం గడిచింది.

* * *

ఆ రోజు సంక్రాంతి. అక్కడే ఆ వూరి పొలిమేరలోనే సాయమ్మ చెరువులో పారు వేట. ఆ వేటలో తరతరాల నుండి గెలుపు జాగీరుదారుదే. ఆ రోజూ అంతే జరుగుతుంది. పొరబాటున ఎవరి తుపాకీ గుండైనా ఆ మేకపిల్ల ప్రాణం తీసినా ఆ కాల్చిన ఘనత జాగీరుదారుదే. జాగీరుదారు పేరే చెప్పాలి. చెప్పి తీరాలి.

సాంబశివయ్య పారువేటకు సిద్ధమవుతున్నాడు. జోడు గుర్రాల తుపాకీని తుడిచి పెట్టమని మల్లుగానికి ఉదయమే చెప్పాడు. కానీ అతను పండుగనాడు చేయవలసిన వెయ్యి పనుల్లోను దీన్ని మరచిపోయాడు. సాంబశివం ఆ దినం రాజు గారిలాగా తయారయ్యాడు. పాంటు తొడుక్కున్నాడు. కోటు వేశాడు. టై కట్టుకొన్నాడు. అంటుపోగులు చెవిలో మెరిసిపోతున్నాయి. పెద్ద తలపాగా చుట్టాడు. ఆ వేషం అటు పాశ్చాత్యులదీ గాక ఇటు హిందూ రాజులదీ గాక పోయింది. అయినా ఇటు తాతల తరాల వంశమర్యాదల వేషాలను వదలలేక, అటు తెల్ల దొరల అనుకరణను విడువ లేక భారతదేశంలోని గొప్ప గొప్ప జమిందార్లు జాగీర్దార్లతో పాటు కొందరు మేధావులు సహితం ఈ విచిత్ర వేషధారణకు అలవడ్డారు సాంబశివం గారికి రాణి కౌసల్యాదేవి దిష్టి తీసింది. పారు వేటంటే సామాన్యమైంది గాదు అదొక పెద్ద ఉత్సవం. ఒక మైదానంలో పసుపుపూసి కుంకం పెట్టి పూలు చుట్టిన మేక పిల్లనో పొట్టేలునో పాతిన గూటానికి కట్టివేస్తారు. దానితాడు కూడా కొంచెం పొడుగ్గానే ఉంటుంది. ఆ పిల్లకు చాల దూరంలో సరిహద్దు గీత ఉంటుంది. ఆ గీత కావలి నుండి వేటగాళ్ళు తుపాకితో దానిని కాల్చాలి. కాల్చిన వారికా పొట్టేలు బహుమానంగా లభిస్తుంది. ఈ సందర్భంలో పై పందాలు కూడా జరగడం కద్దు. ఏటా జరిగే ఈ పారు వేటకు ప్రత్యేకించి జాగీర్దారుగారిని గుర్రం మీద ఊరేగిస్తూ మేళ తాళాలతో తీసుకొని వెడతారు. జాగీరుదారు పొట్టేలును కాలుస్తాడు. ఒక్కొక్కసారి మరెవరో కాలుస్తుంటారు. అయినా జాగీర్దారు వారు కాల్చినట్టే ప్రకటిస్తారు.

సాయంకాలం గుర్రంతో పాటు గ్రామస్తులు వచ్చారు. మేళ తాళాలు వచ్చాయి. సాంబశివం గుర్రానెక్కి "ఒరేయ్ మల్లూ తుపాకి తీసుకురా" అన్నాడు. మల్లుగాని కప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఉదయమే దానిని తుడిచి పెట్టి వుండాలి. అదురుతూనే తుపాకిని గబగబా తీసుకొని వచ్చి యిచ్చాడు. సాంబశివం తుపాకి అందుకోగానే చేతినిండా ధూళి నిండిపోయింది. వెంటనే ఎడం కాలితో మల్లుగాణ్ణి ఒక తాపు యిచ్చాడు. ఆ దెబ్బ గడ్డానికి తగిలి వాడు విరుచుకుని పడ్డాడు. కడప వద్ద పడక కుర్చీలో వున్న పరమేశ్వరయ్య ఆ దృశ్యాన్ని చూచి ప్రక్కకు తిరిగి లేవలేక లేచి లోపలకు వెళ్లాడు.

ఊరేగింపు కదిలింది. సాంబశివం తుపాకిని అతని మిత్రుడు నరసయ్య తనపై కండువాతో తుడిచి పెట్టాడు. ఊరేగింపు ఊరి కొనకు వెళ్లిపోయింది.

మల్లుగాని గడ్డం బాగా వాచిపోయింది. అక్కడ... అందరి సమక్షాన తన్ను బూటుకాలితో తన్నటం ఎంతో పరాభవంగా తోచింది. పావుగంట గుడిసెలో పడుకొని ఏడ్చాడు. బుచ్చి ఊరేగింపులో జరిగింది చూడలేదుగాని ఊరేగింపుతో వెడుతూ ఊరిబయట రంగమ్మ చెప్పగా విన్నది. ఒక్క పరుగుతో గుడిసెకు వచ్చి చూచింది. కొడుకు గడ్డం బుసబుసమని పొంగినట్టు ఉబ్బిపోయింది. ఎముకకు కూడా మంచి దెబ్బ తగిలినట్టుంది. ఆమె చక్కా మేడలోపలకు వెళ్ళింది. అప్పుడే బయటకు వస్తున్న కౌసల్య "ఏమీ అనుకోకు వాడు ముక్కోపి. నలుగురిలో ఏమీ అనలేకపోయాను. రాత్రికి ఇంటికి రానీ చెబుతాను" అంటూ సముదాయించింది. బుచ్చి నోరు మెదపలేదు. కౌసల్య ఆమెను గుడిసె వరకూ తీసుకొని వచ్చి మల్లుగాని దెబ్బను చూచి కాపడం పెట్టమన్నది. రాత్రి బాగా ఆలస్యమైన తర్వాత సాంబశివం యింటికి వచ్చాడు. అతడు రాకముందే పారు వేటలో కాల్చిన పొట్టేలును యింటికి తెచ్చారు. సాంబశివంతో నలుగురు భోజనానికి రావడం వలన కౌసల్యకు దండించే అవకాశం దొరకలేదు. నలుగురిలో అతనికి అవమానంగా ఉంటుందని ఊరుకొన్నది. పరమేశ్వరయ్య అసలు పలకరించలేదు.

* * *

ఒక్క మాసం గడిచింది.

* * *

ఆ రోజు విదియ. నెలవంక సన్నని కొడవలి లాగా అస్పష్టంగా కనిపిస్తున్నాడు. పరమేశ్వరయ్య మేడలో ఉత్తరపు పార్శ్వంలోని గదిలో పడుకొని వున్నాడు. అతనికి ఇరవై రోజుల నుండి అస్వస్థతగా వుంది. పైకి లేచి పక్షం రోజులైంది. ఆహారం లేదు. ఏదో గంజి.... పళ్లరసం త్రాగుతున్నాడు. ఈ ఇరవై రోజుల నుంచీ ప్రక్కనున్నాడు మల్లుగాడు. అతని ఉచ్చిష్టాలను మలమూత్రాలను సైతం తానే ఊడుస్తున్నాడు. అతనికి గంజి కూడా తానే యిస్తున్నాడు. కంటికి రెప్పలా చూస్తున్నాడు. సాంబశివం ఊళ్లోనే వున్నాడు. రోజుకొక్కసారి వచ్చి వెడుతుంటాడు. కౌసల్య వస్తూ పోతూనే వుంటుంది. బుచ్చి కూడా అప్పుడప్పుడు గజద్వారం వద్ద

నిల్చొని ఒక్క క్షణకాలం చూచి వెడుతుంటుంది.

జాము రాత్రి దాటిన వెనుక పరమేశ్వరయ్యకు దగ్గు తెర వచ్చింది. ఖణేల్ మంటూ మేడ ప్రతిధ్వనించింది. ఆ శబ్దం గుడిసెకు విన్పించి బుచ్చి గుడ్డి లాంతరు తీసుకొని పరుగెత్తుకొని వచ్చి తలుపును బాదింది. అక్కడున్న సాంబశివం "ఏందది ముసిల్దానా" అన్నాడు. "బాబుగారు గట్టిగా దగ్గుతున్నారు" అన్నది. "వెళ్లు వెళ్లు ఆయన పొద్దులు గూకులూ దగ్గుతూనే వుంటాడు. ఈ దినం కొత్తా" అన్నాడు సాంబశివం.

బుచ్చి నిరాశతో ఒక్కడుగు వెనక్కు పెట్టింది. మళ్ళీ దగ్గు... మునపటి కంటే దీర్ఘమైంది.

బుచ్చి మళ్ళీ తలుపు తట్టింది. ఈ మారు కౌసల్య మేలుకొని వచ్చి తలుపు తీసింది. బుచ్చి లాంతరు గబగబా లోపలకు వెడుతుంటే కౌసల్య అనుకరించింది. గదిలో పరమేశ్వరయ్య మల్లుగాని తొడమీద తలను పెట్టుకొని గీద్చుకొంటున్నాడు. అతనికి మాటలు పడిపోయినై. ఆ వైపు బుచ్చి, ఈ వైపు కౌసల్య నిలబడ్డారు కన్నీళ్లతో. ఇంతలో ఏదో ప్రమాదమే అనుకుంటూ సాంబశివం పాదాలవైపు వచ్చి నిల్చున్నాడు. పరమేశ్వరయ్య ఒక్కసారి నాలుగు వైపులా చూశాడు. అతడేమో చెప్పాలని విశ్వ ప్రయత్నం చేశాడు. సాధ్యం కాకపోయింది. బలవంతంగా అతని రెప్పలు వాలిపోయాయి. అప్పుడే నూనె అయిపోవడంతో వత్తి కాలుతున్న దీపాన్ని గబ్బిలం రెక్కలతో కొట్టింది. రెండు స్త్రీ కంఠాలు చీకటిని దూసుకుంటూ గ్రామస్థులకు వినిపించినై.

* * *

ఒక పక్షం గడిచింది.

* * *

పరమేశ్వరయ్య కర్మనాడు ఎవరి కర్మలో వారున్నారు. కౌసల్య గాజులను పగుల గొట్టారు. మాంగల్యాన్ని పుట్టుక్కున త్రెంచి వేశారు. పూలు త్రుంచి వేశారు. కుంకుం బొట్టును చెరిపి వేశారు. విధి లిఖించకున్నా విధి పేరుతో సంఘం చేసింది. అది ఆచారం. అయితే బుచ్చి సుమంగళిగానే ఉంది. ఆమెను పెళ్లి

చేసుకున్న చిక్కయ్య బ్రతికే వున్నాడు. అతడూ ఆ వూరివాడే.

ఆ రోజు సాయంకాలం వరకూ కుక్క నెవరూ గమనించలేదు. అది ఆకలితో సోలిపోయింది. ప్రొద్దు గూకుతున్నప్పుడు జ్ఞాపకం వచ్చింది మల్లు గానికి. అతడు తక్షణం వెళ్లి గొలుసు విప్పబోయాడు. అది అమాంతం తొడను పట్టుకొని కణికెడు కండను గుంజుకొని నంజుకున్నది. నెత్తురు వరదై పోయింది. మల్లుగాడు కళ్లు తిరిగి పడిపోయాడు. బుచ్చి బావురుమన్నది. చిరుతలాంటి కుక్క. దాన్ని చూస్తేనే భయం. దాని కళ్లు చూస్తే ఏ పసిపాపా పాలు ముట్టదు. కౌసల్యకు కుక్కమీద కోపం వచ్చి చంపుదామని లేచింది. కాని ఆ దినం తాను మూల కూర్చున్న దినం. అప్పుడే ఆభరణాలను ఒలిచి సౌందర్యాలను విడిచి అలంకారాలను తుడిచి తన ముఖాన వికృతాలను చిలికించుకొన్నది. తన హృదయం నిండుకూ విషాదాలను నింపుకొన్నది. వారూ వీరూ చేరారు. మల్లుగాని గాయానికి నెల్లి కాయలు చితక దంచి రాగి కానీ పెట్టి కట్టు కట్టారు. ఆ ఉదయమే కౌసల్య మనిషిని తోడు చేసి ఆసుపత్రికి పంపాలనుకున్నది. కానీ వీలు కాలేదు. మూడో రోజు తీవ్రం కావడంతో దగ్గరే వున్న పొరుగూరి వైద్యుని దగ్గరకు పంపింది. బుచ్చి కూడానే వెళ్ళింది. సాంబశివం ఏమీ పట్టించుకోలేదు.

* * *

ఒక వారం గడిచింది.

* * *

కోర్టు నుండి ముగ్గురు వచ్చారు. వారిలో ఒక ప్లీడరు కూడా వున్నాడు. ప్లీడరు గారిని కౌసల్యకు బాగా తెలుసు. అతడు అప్పుడప్పుడూ వచ్చిపోతున్న వాడే. తమ వ్యవహారాలనంతా అతడే చూస్తున్నాడు. వారికి తగిన సత్కారాలు చేయించింది. ప్లీడరు గారు పరమేశ్వరయ్య గారి వీలునామా ప్రసక్తి తెచ్చాడు.

"ఆస్తిలో సగం మల్లుగాని పేర వ్రాశారు పరమేశ్వరయ్య గారు" అన్నాడు ప్లీడరు.

త్రుళ్లిపడ్డాడా మాటవిన్నదే సాంబశివం. కౌసల్య ఏమీ సమాధానం చెప్ప లేదు. నాలుగు నిమిషాలాగి సాంబశివం అన్నాడు. "అలా ఎందుకు వ్రాశారు?"

"కారణం తెలియదు నాకూ?" అన్నాడు ప్లీడరు.

"ఇది నాకూ ఆశ్చర్యంగానే వుంది. వాడూ ఇక్కడే పుట్టి పెరిగాడు. మా కుటుంబానికి చాకిరీ చేశాడు. అభిమానముంటే ఏ నాలుగు ఎకరాలో వ్రాసివ్వచ్చు. నాకూ అంగీకారమే. అయినా ఇదేమిటి కొడుక్కు పంచిపెట్టినట్టు చెరీ సగమని" అన్నది కౌసల్య.

"ఇదెలా చెల్లుతుందో నేనూ చూస్తాగా. వాడికి సగం పంచివ్వటానికి మా అబ్బకు పుట్టినట్టుందే" అంటూ చర్రుమని తన గదిలోకి వెళ్ళాడు సాంబశివం.

"ఆలోచించండి. అసలు మల్లుగాడెక్కడ?" ప్రశ్నించాడు ప్లీడరు.

"వాణ్ణి కుక్క కరిచింది. ఆ ప్రక్క ఊళ్లోనే వైద్యం చేయించుకొంటున్నాడు. మీరు పడుకోండి. ఉదయం చూడవచ్చు." అంటూ కౌసల్య వెళ్లి ఆలోచనలో పడింది.

ప్లీడరు కోర్టు వారితో పడుకున్నాడు.

* * *

ఒక రోజు గడిచింది.

* * *

ఆ మరునాడు సాయంకాలం వరకు ప్లీడరు అక్కడే వున్నాడు. కౌసల్య అయిదు ఎకరాలు కాకుంటే పాతిక ఎకరాలైనా యివ్వటానికి సమ్మతించింది. కాని సగం యివ్వడానికొప్పుకోలేదు. సాంబశివం రుసరుస లాడుతున్నాడు. ప్లీడరు మల్లుగాణ్ని కలుసుకోవాలని బండి యిమ్మన్నాడు. కౌసల్య విధిలేక మాట వస్తుందని బండి కట్టించింగి.

పొద్దు గూకక ముందే బండి ఊరు దాటుకున్నది. అరమైలు వెళ్లగానే గుడ్డి లాంతరులో ఒక ఒంటెద్దు బండి ఎదురైంది. ఆ బండిలో నుండి సన్నగా రోదన ధ్వని వినిపిస్తోంది. ప్లీడరు తమ బండిని ఆపి ఎదురు బండిలో ఎవరున్నారో కనుక్కోమన్నాడు బండివాణ్ణి. బండివాడు కనుక్కోకనే గుర్తు పట్టాడు. అయ్యో బుచ్చి లాగుంది పాపం! పోయాడు మల్లుగాడు" అన్నాడు. ప్లీడరు స్తబ్ధుడై పోయాడు.